క్లుప్తంగా

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న అంజయ్య

**చిగురుమామిడి:** మండలంలోని నవాబుపేట్ గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశామన్నారు. వెంట సర్పంచ్ సుద్దాల ప్రవీణ్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి, ప్రచారకార్యదర్శి బెజ్జంకి రాంబాబు, విద్యార్థి విభాగం మండలశాఖ అధ్యక్షుడు బోయిని మనోజ్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, పిల్లి వేణు, రమేశ్ పాల్గొన్నారు.

## ‘దళితబంధు’తో వెలుగులు

**హుజూరాబాద్:** దళితబంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగులు నింపిందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రవేశపెట్టిన పథకంతో ఎంతోమంది లబ్ధి పొందారని, దళితబంధును పూర్తిస్థాయిలో అమలు చేశామన్నారు. పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు.

## హన్మాజిపల్లెలో పోషణ్ అభియాన్



హన్మాజీపల్లెలో పోషణ్ అభియాన్

**గన్నేరువరం:** మండలంలోని హన్మాజిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు. సూపర్ వైజర్ ఇశ్రత్ సుల్తానా మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలు, పిల్లలకు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోస్టల్‌బీమాపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యువకులు

**చొప్పదండి:** పోస్టల్‌బీమాను యువత సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ పోస్టుమాస్టర్ విష్ణు కోరారు. పట్టణంలో మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులకు పోస్టల్‌బీమాపై అవగాహన సమావేశం నిర్వహించారు. తక్కువ ప్రీమియంతో పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవైఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, విజయ్‌కుమార్, అనిల్, సదానందం, వెంకటస్వామి, రమేశ్, శ్రీనివాస్, చింటూ, సాయి, హరీశ్, నరేశ్ రావణ్, చందు పాల్గొన్నారు.

## కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు అందజేస్తున్న సుద్దాల దేవయ్య

**రామడుగు:** మండలంలోని షానగర్ గ్రామంలో మంగళవారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిబాబు, రవీందర్, ఎల్లయ్య, రాము, అంజిబాబు, లక్ష్మణ్, జయంత్ పలువురు పాల్గొన్నారు. ప్రధాని మేరా బూత్ సబ్ సే మజ్బూత్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

**హుజూరాబాద్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సోనియా గాంధీ మూలంగానే రాష్ట్రం సిద్ధించిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు సొల్లు బాబు, ఎండీ అప్సర్, ఆడెపు ఐలయ్య, ఎండీ చాంద్ తదితరులు ఉన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా ఎల్‌ఎండీకాలనీ

- 500 మీటర్ల పరిధిలోనే దేవాలయాలు, చర్చి, మసీదు
- మానేరు తీరాన అత్యాధునిక సౌకర్యాలతో తాపాళలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మండపం
- రూ.కోటితో జీప్లస్ వన్ భవనం నిర్మాణం
- రేపు ప్రారంభించనున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ముస్తాబవుతున్న తాపాళ లక్ష్మీనృసింహస్వామి ఆలయం



కల్యాణ మండపంలోని వేదిక

**తిమ్మాపూర్:** మండలంలో ఎల్‌ఎండీకాలనీ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. 500 మీటర్ల పరిధిలో అన్నిమతాల ఆలయాలు, ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. మతసామరస్యానికి ప్రతీకగా కాలనీ వర్ధిల్లుతోంది. ఓవైపు వేంకటేశ్వరాలయం, పక్కనే మృత్యుంజయ, సమీపంలోనే స్వయంభూ తాపాళ లక్ష్మీనృసింహస్వామి ఆలయాలు, మరోవైపు చర్చి, మసీదు అన్ని మతాల ప్రజలు నివసించే ఎల్‌ఎండీకాలనీ జిల్లా కేంద్రానికి కేవలం పదికిలోమీటర్ల దూరంలో ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న కాలనీలో దేవాలయాలు ప్రముఖ క్షేత్రాలుగా ఉన్నాయి. కరీంనగర్‌తోపాటు తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, గన్నేరువరం, కేశవపట్నం మండలాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. మండలంలోని నల్లగొండ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది.

**వేగంగా ఆలయం అభివృద్ధి**

మానేరు నదీ తీరంలో కొండపై వెలసిన తాపాల లక్ష్మీనృసింహస్వామి భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. కొండపై వెలసిన స్వామివారు, పక్కనే హనుమాన్ ఆలయం, గోశాల, ఆహ్లాదకర వాతావరణంతో ఉన్నాయి. దీంతో భక్తులు ప్రత్యేక రోజులు, పండుగలు, పర్వదినాల్లో భారీగా తరలివస్తున్నారు.

**పెళ్లిళ్లకు ప్రత్యేకం..**

తాపాల లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. స్వామివారి సన్నిధిలో పెళ్లి చేసుకుంటే కలకాలం కలిసి ఉంటామనేది భక్తుల నమ్మకం. ప్రేమ వివాహాలు కూడా ఎక్కువగనే జరుగుతుంటాయి. సుమారు 20 సంవత్సరాల పైనుంచి ఐదువేల వివాహాలు జరిగాయని అర్చకుడు తిరునగిరి వెంకటాద్రిస్వామి తెలిపారు. ఈనేపథ్యంలో ఆలయ ఆవరణలో సరిపడా స్థలం లేకపోవడంతో పెళ్లిళ్ల కోసం ప్రత్యేక మండపం నిర్మించారు.

**రూ.కోటితో నిర్మాణం..**

ఆలయ ఆవరణలోనే సుమారు 15 గుంటల విస్తీర్ణంలో ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మించారు. మొదటిగా 2016లో పనులు ప్రారంభం కాగా నిధుల కొరత, కరోనా కారణంగా పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే భక్తుల సహకారాలతో ఏడాది క్రితం ప్రారంభమైన పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం ఆలయ సీజీఎఫ్ రూ.10 లక్షలతోపాటు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చొరవతో దేవాదాయశాఖ నుంచి రూ.40 లక్షలు కల్యాణ మండపం కోసం మంజూరు చేయించారు. మరో రూ.50 లక్షల వరకు భక్తుల నుంచి విరాళం సేకరించారు. మొత్తంగా రూ.కోటితో అత్యాధునిక సౌకర్యాలతో జీప్లస్ వన్ కల్యాణ మండపం నిర్మించారు. ఈ నెల 29న కల్యాణ మండపాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ చెర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభోత్సవం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

### జూలై 1 నుంచి అందుబాటులోకి



భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా తాపాళ లక్ష్మీనరసింహాస్వామి వెలుగొందుతున్నారు. ఆలయంలో సుమారు ఐదువేలకుపైగా వివాహాలు జరిగాయి. భక్తులకు నూతన కల్యాణ మండపం జూలై 1 నుంచి అందుబాటులోకి వస్తుంది. దైవ కార్యాలతోపాటు భక్తుల శుభకార్యాల కోసమే ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మించాం. వివాహాది శుభకార్యాలు కూడా ఇక్కడ నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుంది.

– తిరుమలగిరి వెంకటాద్రిస్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు

### భక్తుల సహకారం మరువలేనిది



తాపాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టినప్పుడు ఆలయానికి సంబంధించిన నిధులు రూ.10 లక్షలు మాత్రమే ఉన్నాయి. ఎమ్మెల్యే రసమయి దేవాదాయశాఖ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయించారు. ఇక లక్ష్మీనృసింహస్వామి భక్తులు ఏకంగా రూ.50 లక్షలు విరాళం అందించారు. భక్తుల సహకారం మరువలేనిది. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి విరాళం అందజేయాలి.

– ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



హుజూరాబాద్: ప్రశంసా పత్రాలిస్తున్న నిర్వాహకులు

**హుజూరాబాద్:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీలు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. క్విజ్ నిర్వాహకులు గుడిపెల్లి సదానందం, ఉపాధ్యాయులు ఓరుగంటి తిరుపతి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

**జమ్మికుంట:** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సోషల్ వెల్ఫేర్ జమ్మికుంట పాఠశాల విద్యార్థులు చైతన్య, రుషిసిద్ధార్థ మొదటి, బాలికల పాఠశాల విద్యార్థినులు సుమశ్రీ, హరిణి రెండవ, కోరపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు స్పందన, శ్రీహర్ష మూడవ స్థానంలో గెలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంఈవో విడుపు శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ భగీరథ్, ఉపాధ్యాయులు శ్యామ్, సురేష్, సదానందం, ఆర్పీలు రవి, గుర్రప్ప పాల్గొన్నారు.

**రామడుగు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ఎస్. శ్రీజవర్షిని, ఏ. స్వాతిక జెడ్పీ ఎస్ రుద్రారం ప్రథమ, ఈ. హరిప్రియ, కె. వినయ్‌కార్తీక్, జెడ్పీఎస్ గోపాల్‌రావుపేట ద్వితీయ, కె. రజిత, కె. సంజన, జెడ్పీఎస్ వెలిచాల విద్యార్థులు తృతీయ స్థానంలో గెలుపొందారు. యూబీఐ బ్యాంకు మేనేజర్ పి. కోటేశ్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం పి. మోహన్, భారతి టీచర్లు పాల్గొన్నారు.



రామడుగు: సర్టిఫికెట్స్ అందజేస్తున్న కోటేశ్

# విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

**మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన**




మాట్లాడుతున్న ఎంపీపీ కలిగేటి కవిత

**రామడుగు:** మండలంలో అధికారులు విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ విద్యుత్ కనెక్షన్లు, స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ కలిగేటి కవిత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో దత్తోజీపల్లి సర్పంచ్ బండ అజయ్‌రెడ్డి మాట్లాడుతూ... గత ఎండాకాలంలో గాలివానతో నేలకూలిన విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కనీసం వరినార్లు కూడా పోసుకొని పరిస్థితి ఉందని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టింకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రైతులు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారని పేర్కొన్నారు. రుద్రారం గ్రామంలో నిర్మించిన శ్మశానవాటికకు విద్యుత్ స్తంభాలు వేసినప్పటికి కనెక్షన్ మాత్రం ఇవ్వలేదని సర్పంచ్ ఒంటెల అమరేందర్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ అధికారులు ఇంటి పైనున్న లైన్లు, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను తక్షణం తొలగించాలని ఎంపీపీ కవిత విద్యుత ఏఈ శంకరయ్యకు సూచించారు. పందికుంటపల్లి శ్మశానవాటిక బిల్లు చెల్లింపులో తమకు అన్యాయం జరిగిందని సర్పంచ్ ఏల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందుతున్న తాగు నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టనట్టు ఉంటున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన అటెండర్ అబ్బుకు నివాళి అర్పించారు. సమావేశంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**డీఆర్‌డీవో అదనపు అధికారి సంధ్యారాణి**



మాట్లాడుతున్న సంధ్యారాణి

**ఇల్లందకుంట:** ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో అదనపు అధికారి సంధ్యారాణి హెచ్చరించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా 2020–23 మార్చి వరకు రూ.5.54 కోట్లతో వివిధ రకాల పనులు చేశామని అధికారులు వెల్లడించారు. తొమ్మిది బృందాలతో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు వీఎస్‌లు గ్రామాల్లో పనుల తనిఖీ చేశారని, కొన్ని గ్రామాల్లో అవకతవకలు జరిగాయని గుర్తించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో అడిషనల్ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ. లక్షా నలభై వేలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాంటేషన్ రిజిస్టార్‌ను విధిగా మెయింటైన్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్అసిస్టెంట్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీధర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి వసంత, ఏపీవో రవి, ఎంపీవో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కుడికాలువ పనులు పూర్తి చేయాలి



కుడికాలువను పరిశీలిస్తున్న నాయకులు

**గంగాధర:** మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కుడికాలువ పనులు వెంటనే పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మధురానగర్‌లో అసంపూర్తిగా ఉన్న కుడికాలువ పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు కమీషన్లపై ఉన్న శ్రద్ధ కుడికాలువ పనులపై లేదని, 2008లో పల్లెబాట కార్యక్రమంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా కుడి,ఎడమ కాలువల పనులకు శ్రీకారం చుట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని పది శాతం పనులు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. అవసరం లేకున్నా అదనపు టీఎంసీ కాలువ నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కుడి,ఎడమ కాలువలకు నిధులు ఇవ్వడం లేదన్నారు. కాలువలు, రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని లేదంటే గంగాధర, బోయినిపల్లి మండలాల రైతులతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు. వెంట నాయకులు మనోహర్, రమణారెడ్డి, బుచ్చయ్య, రాజిరెడ్డి, స్వామి, బూర్గు గంగన్న, వీరేశం, రాజశేఖర్‌రెడ్డి,జాగిరపు శ్రీనివాసరెడ్డి, చిప్ప చక్రపాణి, రాచమల్ల భాస్కర్, రాజేశం, శంకరయ్య తదితరులు ఉన్నారు.



## గన్నేరువరంలో ఎల్లమ్మ బోనాలు

**గన్నేరువరం:** మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బుర్ర ఎల్లయ్యగౌడ్, బుర్ర రాజయ్యగౌడ్, బుర్ర తిరుపతిగౌడ్, బుర్ర ముత్తయ్యగౌడ్, నాగుల కనకయ్యగౌడ్, బుర్ర అంజయ్యగౌడ్, ముత్యం అంజయ్యగౌడ్, పురుషోత్తం కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**అందుబాటులో విత్తనాలు**

**వీణవంక:** వానాకాలంలో వరి సాగుకు తెలంగాణ సీడ్స్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తీర్ణాధికారి రాకేశ్, టీఎస్ సీడ్స్ సూపర్‌వైజర్ సాధన తెలిపారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కేఎన్‌ఎం118, ఎంటీయూ 1010, టీపీటీ5204, కేఎన్‌ఎం1638, ఆర్‌ఎన్‌ఆర్34449 చల్లారు, వీణవంక దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలను మాత్రమే రైతులు ఎంపిక చేసుకోవాలని, ధ్రువీకరణ లేని విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కాంతాల రాజిరెడ్డి, గుడిపాటి శివారెడ్డి, నాగిడి రాంరెడ్డి, ఉపేందర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

**దరఖాస్తు చేసుకోవాలి**

**చొప్పదండి:** జూన్ 16లోగా కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు పొందిన రైతులు జూలై 3లోగా రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో వంశీకృష్ణ తెలిపారు. ఆధార్, పట్టాదారు పాసు బుక్, తదితర జిరాక్స్ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని కోరారు. దీంతో పాటు పీఎం కిసాన్ పథకంలో ఈకేవైసీ చేసుకోని రైతులు కూడా ఈ నెల చివరిలోగా మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**రైస్‌మిల్లర్లతో సమావేశం**

**శంకరపట్నం:** మండలంలోని రైస్‌మిల్లర్లతో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. మండలంలోని ఏరడపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించామని, తాడికల్‌లోని రైస్‌మిల్లు యజమాని ధాన్యంలో కోత విధించారని చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేశారు. రైతులతో మాట్లాడుకోవాలని చెప్పినట్లు తహసీల్దార్ స్పష్టం చేశారు.

**ప్రధాని మోదీ ప్రసంగం వీక్షణ**

**మానకొండూర్:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో టీవీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

**చిగురుమామిడి:** మండల కేంద్రంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు టీవీల్లో వీక్షించారు. కార్యకర్తలు బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని కోరారు.

**సంక్షేమ పథకాల అమల్లో విఫలం**

**గన్నేరువరం:** సంక్షేమ పథకాల్లో అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం గునుకులకొండాపూర్‌లో మాట్లాడారు. నిధులు, నీళ్లు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ నేడు జీతాలు చెల్లించలేని స్థితిలో ఉండటం సిగ్గు చేటన్నారు. రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగభృతి వెంటను అమలుచేయాలని కోరారు, సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు.

**పదవుల పేరుతో పబ్బం.. అభివృద్ధి శూన్యం**

**మానకొండూర్:** సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ పదవుల పేరుతో పబ్బం గడుపుతున్నారు తప్పా చేసిన అభివృద్ధి శూన్యం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు.

**జీపీల అభివృద్ధిపై పట్టింపేది?**

**సైదాపూర్:** ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి గాలికొదిలేసింది, నూతన పంచాయతీల అభివృద్ధిపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు పట్టింపులేదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లిలో ఇంటింటికి కాంగ్రెస్‌లో భాగంగా గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు.

**సమన్వయంతో ముందుకు సాగాలి**

**గన్నేరువరం:** నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు.

**రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు**

**జమ్మికుంట:** కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు... మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జమ్మికుంట వైపు వస్తున్న ట్రాక్టర్ మడిపల్లి వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు నడుపుతన్న రాయికంటి వీరారెడ్డి, పక్కన కూర్చున్న ఒల్లాల సాంబయ్యకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో వరంగల్‌కు తరలించారు.

**శంకరపట్నం:** మండలంలోని గొల్లపల్లి వద్ద మంగళవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. కొత్తగట్టుకు చెందిన పైడిపల్లి ప్రవీణ్ మొలంగూర్‌క్రాస్ నుంచి ఇంటికి, గొల్లపల్లికి చెందిన కాసు తిరుపతి కొత్తగట్టు నుంచి ఇంటికి వస్తుండగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడినవారిని హుజూరాబాద్‌కు తరలించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు లతీఫ్, సదానందం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## ఎమ్మెల్యే రాజీనామా చేయాలి



**గంగాధర:** మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి నాలుగేళ్ల గడిచాయని, ప్రభుత్వాన్ని ఒప్పించని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పదవికి రాజీనామా చేసి నిరాహార దీక్షలో పాల్గొనాలని మండల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గర్శకుర్తి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారం 59వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పాటవుతున్నా 33 గ్రామ పంచాయితీలు ఉన్న గంగాధరలో కొత్త మండలం ఏర్పాటుకు మోక్షం లభించడం లేదన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో ఇటీవల మృతి చెందిన సర్పంచ్ గోపు కోమురారెడ్డి కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. వెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.